శ్రీ కృష్ణుని మేలుకొలుపు "పాట"

కేశవ నామాలతో

శ్రీరస్తు

శుభమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్,
41-1/8-13A., గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

Kiron Type Institute

శ్రీ కృష్ణుని మేలుకొలుపు 'పాట'

కేశవ నామాలతో

తెల్లవారవచ్చె దిక్కులు తెలుపొందె నల్లని నాస్వామి మేలుకో।
వేళాయె గోవులమందకు పోవలె గోపాల బాలుడా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

01. కేశవ యని నిన్ను వాసిగ భక్తులు
వర్ణించు చున్నారు మేలుకో।
వాసవ వందిత వసుదేవ నందన
వైకుంఠ వాసుడా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

02. నారాయణా నిను నమ్మిన భక్తుల
కరుణ బ్రోతువు వేగ మేలుకో।
శరణన్న రక్షణ బిరుదు నీకున్నది
శశిధర సన్నుతా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

03. మాధవ యని నిన్ను యాదవులందరు
మమత జెందుతున్నారు మేలుకో।
చల్లని చూపుల తెల్లని నామము
నల్లని నాస్వామి మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

04. గోవింద యని నిన్ను గోపికలందరు
గొల్లవాడందురు మేలుకో।

గోపీ మనోహర గోవర్ధనోద్ధార
గోపాలబాలుడా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

05. విష్ణు రూపముదాల్చి విభవము దర్శించ
విష్ణు స్వరూపుడ మేలుకో।
దుష్టసంహారక దురితము లెడబాపు
సృష్టి సంరక్షక మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

06. మధుసూదన నీవు మగువ తోడుత గూడి
మరచి నిద్రించేవు మేలుకో।
ఉదయార్క బింబము ఉదయించు వేళాయె
వనరుహ లోచన మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

07. త్రివిక్రమా యని శుక్రాదులందరు
విక్రమ మందురు మేలుకో।
శుక్రాది గ్రహములు సుందరరూపము
చూడగోరుచున్నారు మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

08. వామన రూపమున భూదాన మడిగిన
పుండరీకాక్షుడా మేలుకో।
బలిని నీ పాదమున బంధన జేసిన
కశ్యప నందనా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

09. శ్రీధర, గోవింద, రాధా మనోహర
యాదవ కులతిలక మేలుకో।
రాధావధూమణి రాజిల్క నంపింది
(పొడచూతువు)చూడబోతువుగాని మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

10. రి(హృ)షీకేశ యీా భువియందు ఋషులందరు
వచ్చి కూర్చొన్నారు మేలుకో।
వచ్చినవారికి వరములు కావలె
వైకుంఠ వాసుడా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

11. పద్మనాభ నీదు పత్ని భామాదులు
వచ్చి కూర్చున్నారు మేలుకో।
పరమ తారకమైన పావన నామము
పాడుచు వచ్చిరి మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

12. దామోదరాయని దేవతలందరు
దర్శింప(చ) వచ్చిరి మేలుకో॥
భూమి భారము మాన్ప(మొప) ఋధుల బ్రోవను రావె
భూకాంత రమణుడా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

13. సంకర్షణ నీవు శత్రుసంహార (మొనర్ప)మొసగ
సమయమై యున్నది మేలుకో॥

పంకజాక్షులు నీదు పావన నామము
పాడుచు వచ్చిరి మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

14. వాసుదేవా నీకు (భూ)సుర పత్నులు
భుజియింప దెచ్చిరి మేలుకో।
భౌ(భూ)సురంబుగ యాగసంరక్షణ కొరకు
వర్ణింపు చున్నారు మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

15. ప్రద్యుమ్న రూపుడ అర్జున వరదుడ
దుర్జన సంహార మేలుకో।
అబ్జవంశమునందు ఉద్భవించిన
కుబ్జ నాదరించిన దేవ మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

16. అనిరుద్ధ యని నిన్ను అబ్జభవాదులు
అనుసరింప వచ్చె మేలుకో।
అండజవాహన అబ్ధిసంహారణ
దర్భశయన వేగ మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

17. పురుషోత్తమా యని పుణ్యాంగనలంత
పూజలు జేతురు మేలుకో।
పురుహూతవందిత పురహర మిత్రుడ
పూతన సంహార మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

18. అధోక్షజ మిమ్ము స్మరణ జేసినవారి
దురితము లె(నె)డబాప మేలుకో।
వరుసతోడుత నిన్ను(మిమ్ము) స్మరణ జేసినవారికి
వందన మొసగెద మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

19. నారసింహ నిన్ను నమ్మిన భక్తుల
కరుణఁబ్రోతువు వేగ మేలుకో।
శరణన్న రక్షణ బిరుదు గల్గిన తండ్రి
శశిధరసన్నుతా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

20. అచ్యుతా యని నిన్ను సత్యముగ
ప్రమదులు(బహువిధుల) కొనియాడవచ్చిరి మేలుకో।
పచ్చని చేలమూ అచ్చంగ దాల్చిన
లక్ష్మీమనోహర మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

21. జనార్ధనా నీవు శత్రుసంహార మొసగ(మొనర్చ)
సమయమైయున్నది మేలుకో।
పంకజాక్షులు నీదు పావననామము
పాడుచువచ్చిరి మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

22. ఉపేంద్రా యని నిను యు(సు)వదులందరు
గూడి యమునతీర మందున్నారు మేలుకో।

గోపీ(ప)కాంతలు నీదురాక కో(గో)రుచున్నారు
మురళీనాదవినోదా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

23. హరి హర యని నిన్ను కొనియాడ
గోపికా జనులంత వచ్చిరి మేలుకో।
అష్టభార్యలు నీదు రాక గోరుచున్నారు
వనమాలికాధర మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

24. శ్రీకృష్ణా యని నిన్ను గోపాల బాలురు
బంతులాడ వచ్చిరి మేలుకో।
కాళింగ(కాళీయ)మర్ధన కౌస్తుభ మణిహార
కంససంహరణ(ణా) మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

25. శ్రీరామ యని మునులు స్థిరభక్తితో
నిన్ను(మిము) సేవించు(పు)చున్నారు మేలుకో।
తాటకీసంహార ఖరదూషణాంతక
కాకుత్థ్సకులరామా మేలుకో॥

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥

26. తెల్లవారవచ్చె దిక్కులు తెలుపొందె
నల్లని నాస్వామి మేలుకో।
వేళాయె గోవులమందకు బో(పో)వలె
గోపాల బాలుడా మేలుకో।

॥ కృష్ణా తెలవారవచ్చెను...॥మేలుకో.. మేలుకో..

---===---

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

Kiron Type Institute



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. – 994 994 1430 OR 944 044 9650)